సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 17 । జనవరి । 2025



టన్ను చీనీ రూ.16,560
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.16,560, కనిష్ఠంగా రూ.12 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.11
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట రూ.11, కనిష్ఠంగా రూ.6, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం 31.7°/17.3°
జిల్లా పరిధిలో గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రశాంతి నిలయం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందుబాటులోకి తెచ్చిన పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇంటర్న్‌షిప్ చేసేందుకు టాప్ 500 కంపెనీలతో ఒప్పందం ఉంటుందని, కనీసం ఆరు నెలలు సాధన చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 93986 43930 నంబరును సంప్రదించాలని కోరారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ధర్మవరం జానపద కళాకారిణి



సోమిశెట్టి సరళ

ధర్మవరం అర్బన్: రిపబ్లిక్ డే వేడుకల్లో ధర్మవరం పట్టణానికి చెందిన జానపద కళాకారిణి సోమిశెట్టి సరళ తన బృందంతో కలిసి ప్రదర్శన ఇవ్వనున్నారు. ఇప్పటికే ఢిల్లీలో రిహార్సల్స్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈనెల 24న గిన్నిస్ బుక్ నిర్వాహకుల సమక్షంలో ప్రదర్శన ఇస్తున్నామని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 22 జానపద కళారూపాలు, 29 గిరిజన కళారూపాలతో కలిపి 5 వేల మంది కళాకారులతో ఒక పెద్ద కళా ప్రదర్శన ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలాగే 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముందు ప్రదర్శన ఇస్తామన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకండి

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీలో అప్రెంటిషిప్ చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తున్న అభ్యర్థులు ఈనెల 20వ తేదీన కర్నూలు శిక్షణ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలని డీపీటీఓ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డ్, జనన ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్ సెట్, పాస్‌ఫొటోతో పాటు రూ.118 ఫీజు తీసుకొని జనవరి 20న కర్నూలులో ఉన్న శిక్షణ కళాశాలలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు.

అప్రెంటిషిప్‌కు ఎంపికైన వారి నంబర్లు ఇలా..
డీజిల్ మెకానిక్: 61, 18, 67, 91, 84, 81, 72, 61, 12, 50, 79, 19, 10, 92, 42, 20, 9, 80, 59, 24, 40, 45, 26, 76, 34, 83, 37,
మోటర్ మెకానిక్: 34, 22, 8,
ఎలక్ట్రీషన్: 36,87,95, **వెల్డర్:** 06,
పెయింటర్: 11, **డ్రాఫ్ట్‌మెన్ సివిల్:** 02

బుక్కపట్నంలో చిరుత కలకలం



చిరుత సంచరించిన పంట పొలాలను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

పుట్టపర్తి: బుక్కపట్నం మండల పరిధిలోని కృష్ణాపురం, గోపాలపురం గ్రామాల సమీపంలోని పంట పొలాల్లో బుధవారం రాత్రి చిరుత సంచారం కలకలం రేపింది. చిరుత సంచారంపై స్థానికులు అటవీశాఖ, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో గురువారం వారు చిరుత సంచరించిన పంట పొలాలను పరిశీలించారు. స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిరుత ఆచూకీ తెలిసే వరకూ ఆయా గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే గురువారం యాదలంకపల్లి పరిసర ప్రాంతాలలో చిరుత సంచరించినట్లు తెలిసింది.

మద్యం దందా వెనుక.. కి'లేడీ'!



జిల్లా వ్యాప్తంగా కర్ణాటక లిక్కర్‌తో పాటు గోవా, మహారాష్ట్ర మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. హిందూపురం కేంద్రంగా భారీగా మద్యం డంపు చేసి పలు ప్రాంతాలకు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఆదాయమే ధ్యేయంగా కొందరు అక్రమ రవాణా బాట పట్టారు. లిక్కర్ దందా వెనుక ఓ మహిళ కీలకమనే ప్రచారం సాగుతోంది.



- లిక్కర్ వ్యాపారంలో కీలక పాత్ర
- ప్రతి వారం గోవా, మహారాష్ట్రల నుంచి అక్రమ మద్యం
- ఇటీవల పట్టుబడిన రెండు లారీల మందు ?
- నేటికీ వివరాలు మాత్రం వెల్లడించని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సాక్షి, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ఏరులై పారుతోంది. ఇబ్బడి ముబ్బడిగా వెలసిన నూతన మద్యం షాపులకు తోడు ఇతర రాష్ట్రాల మద్యం విక్రయాలు కూడా యథేచ్ఛగా సాగుతున్నాయి. గోవా, మహారాష్ట్ర నుంచి మద్యాన్ని భారీగా తెప్పించుకుని ఒక దగ్గర దాచి.. విడతల వారీగా.. రాత్రి వేళల్లో అధిక ధరలకు కేసుల లెక్కన తరలిస్తున్నారని సమాచారం. ఏ రాష్ట్రం మద్యమో చూసుకోకుండా కిక్కు కోసం ఏదోటి అన్నట్లు మందుబాబులు సేవిస్తుండటంతో దీన్నే కొందరు కూటమి నేతలు 'క్యాష్' చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. అయితే ఇటీవల వాటాల్లో తేడా రావడంతో మద్యం దందా విషయం బయటికి పొక్కింది. వాటాదారుల్లోనే ఒకరు అధికారులకు సమాచారం ఇవ్వడంతో మెరుపు దాడులు చేసి పట్టుకున్నట్లు సమాచారం. అయితే కేసు నమోదు చేసి కొందరిని అదుపులోకి తీసుకున్నప్పటికీ.. ఇప్పటికీ బహిరంగ ప్రకటన చేయకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మహిళ ఆధ్వర్యంలోనే..

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు వీరాభిమాని అయిన చిలమత్తూరు మండలానికి చెందిన ఓ మహిళ మద్యం ధరలపై అధ్యయనం చేసి, గోవా, మహారాష్ట్ర నుంచి మద్యం తెప్పించుకుని విక్రయిస్తే తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనకు వచ్చిందని తెలిసింది. ఇందులో భాగంగా కొందరు టీడీపీ నేతలు, మద్యం దుకాణాల నిర్వాహకులతో చర్చించి రేటు ఫిక్స్ చేసుకుని దందా మొదలు పెట్టిందని సమాచారం. గత నాలుగు నెలలుగా మహారాష్ట్ర మద్యం దందా కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రతి వారం రెండు మద్యం లారీ వస్తాయని, వాటిని ఒక తోటలో డంపు చేసి గుట్టుచప్పుడు కాకుండా ఒప్పందం మేరకు ఆయా ప్రాంతాలకు రాత్రి వేళల్లో తరలించే వారని అంటున్నారు.

వాటాల్లో తేడా రావడంతోనే..

కొందరు సమూహంగా ఏర్పడి అక్రమ మద్యం దందా కొనసాగిస్తున్నప్పటికీ.. వాటాల్లో తేడా రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిసింది. నాలుగైదు రోజుల పాటు రాత్రింబవళ్లు దాడులు చేసి డంపు చేసిన మద్యంతో పాటు 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఎవరిని పట్టుకున్నారనే విషయం మాత్రం చెప్పడం లేదు. కొందరు టీడీపీ నేతలు ఉండటంతో.. వారిని తప్పించే ప్రయత్నించేందుకు పోలీసులపై ఎమ్మెల్యే పీఏలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది.

ఆమెనే 'కీ'లకం..

మద్యం దందాలో కీలకంగా వ్యవహరిస్తున్న మహిళ గురించి హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అయితే ఆమె ఎవరనే దానిపై స్పష్టత ఉన్నప్పటికీ పోలీసులు అదుపులోకి తీసుకోలేదని తెలిసింది. అయితే ఫోన్ ద్వారా పోలీసు అధికారులు విచారణ చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలిసిన తర్వాతనే బహిరంగ ప్రకటన చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

పీఏల కనుసన్నల్లోనే..

అక్రమ మద్యం దందా విషయం గురించి కొందరు పోలీసులకు తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి ఉందని పోలీసు వర్గాలే చెబుతున్నాయి. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల కనుసన్నల్లోనే మద్యం దందా జరుగుతుండటంతో నోరుమెదపడం లేదని అంటున్నారు. ఎక్సైజ్ పోలీసుల తీరు అదే కోణంలో కొనసాగుతోంది. అంతేకాకుండా మద్యం, బెల్టు షాపుల నిర్వాహకుల నుంచి ప్రతి నెలా కొందరు పోలీసులకు కూడా 'మామూళ్లు' వెళ్తున్నాయన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్రమ మద్యం వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విస్తరించింది.



అక్రమ మద్యం వెనుక ఎవరున్నా వదిలేది లేదు



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ రమేష్

హిందూపురం అర్బన్: అక్రమ మద్యం, కల్తీ కల్లు అమ్మకాలపై 'సాక్షి'లో వరుస కథనాలు రావడంతో ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించారు. అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ రమేష్ గురువారం హిందూపురం చేరుకొని ఎక్సైజ్ కార్యాలయ అధికారి రామకృష్ణ, సిబ్బందితో ఆరా తీశారు. ఏఈఎస్ రమేష్ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో మహారాష్ట్ర, కర్ణాటక మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపుల్లో అమ్మకాలు చేస్తూ పట్టుబడిన 12 మందిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపామన్నారు. అంతటితో కేసు ముగియలేదని మద్యం ఎవరు సరఫరా చేశారు? వారు ఎవరికి రవాణా చేస్తున్నారు? డంప్ ఎక్కడ ఏర్పాటు చేశారు? తదితర వాటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. తెర వెనుక ఎంతటి వారున్నా వదిలే ప్రసక్తి లేదన్నారు. అలాగే హిందూపురం ఎక్సైజ్ కార్యాలయ పరిధిలోనే 17 చోట్ల కల్తీ కల్లు అమ్మకాలు చేస్తున్నట్లు చిత్తూరు ల్యాబ్ నుంచి రిపోర్టులు అందాయని, వాటిపై కూడా ఆరా తీస్తున్నామన్నారు. కల్తీ మద్యం, కల్లు అమ్మకాలకు సహకరించారన్న ఆరోపణలతో ఇక్కడ పని చేస్తున్న సీఐ లక్ష్మీదుర్గయ్యను పక్కన పెట్టామని వెల్లడించారు. అతనే కాకుండా శాఖలో ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా అనే దానిపై కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఏది ఏమైనా అక్రమ మద్యం, కల్తీ కల్లు వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి సవిత తీరుమార్చుకోవాలి



బాధితులతో కలసి విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్
- జిల్లాలో పోలీస్ పనితీరుపై అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర మంత్రి సవిత తన స్వప్రయోజనాలకు పోలీస్ వ్యవస్థను వాడుకొంటూ నియోజవర్గ వ్యాప్తంగా అరాచకాలు, ఆక్రమణలు, భూదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇప్పటికైనా ఆమె తీరు మార్చుకోవాలి' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హెచ్చరించారు. గురువారం పెనుకొండ నియోజవర్గంలో పోలీసుల బెదింపులకు గురైన బాధితులతో కలసి వచ్చి అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్ కార్యాలయ ఆవరణలో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెనుకొండ నియోజవర్గంలో మంత్రి సవితతో పాటు ఆమె అనుచరులు భూదందాలు, అరాచకాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారన్నారు. పోలీసులు ఆమెకు వత్తాసు పలుకుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బెదిరింపులకు దిగుతుండటం బాధాకరమన్నారు. ముష్టికోవెల గ్రామంలో రెండు నెలల క్రితం సుధాకర్‌రెడ్డి టీడీపీ నేతల బెదిరింపులతో ఆత్మహత్య చేసుకున్నాడని, వారి మీద పోలీసులు సెక్షన్ 306 కేసు నమోదు చేశారన్నారు. అయితే నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోకుండా కేసు రాజీ కావాలని ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. గుట్టూరులో ఓ మహిళపై దాడి చేయడంతో పాటు ఆమె కొప్పు కోశారన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. జిల్లా సరిహద్దుల్లో ఇసుక అక్రమంగా కర్ణాటక ప్రాంతాలకు తరలిపోతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. సోమందేపల్లిలో మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఫ్లెక్సీని ఏర్పాటు చేశారని, అయితే మంత్రి సవిత జన్మదిన వేడుకలు ఉన్నాయని ఫ్లెక్సీని తొలగించాలని, లేకుంటే కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించడం దారుణమన్నారు. అక్రమాలకు పాల్పడుతూనే మంత్రి సవిత స్వప్రయోజనాలకు పోలీసులను సైతం వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్నోరోజులు ఇలాంటి ఆటలు సాగవన్నారు. మంత్రి సవిత, పోలీసులు తీరు మార్చుకోకుంటే ఉద్యమాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. చట్టం ముందు అందరూ సమానులేనని.. క్షేత్రస్థాయిలో విచారించి బాధితులకు న్యాయం చేస్తామని అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఫక్రోద్దీన్, పెనుకొండ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి, యువనాయకులు ఈశ్వర్‌యాదవ్, లక్ష్మీనారాయణ, కలందర్‌బాషా, బాధితులు రఘురామిరెడ్డి, హేమలత, మారుతీరెడ్డి, నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో లక్ష్యం చేరుకోవాలి

- బ్యాంకు అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాలను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఎల్‌టీసీ (డిస్ట్రిక్ట్ లెవెల్ టెక్నికల్ కమిటీ), జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాలను చేరుకునేందుకు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. స్టాండప్ ఇండియా కింద ప్రతి బ్యాంకు రెండు రుణాలను కచ్చితంగా మంజూరు చేయాలని చెప్పారు. సామాజిక మాధ్యమాల ద్వారా విరివిగా అవగాహన కల్పించాలన్నారు. బీసీ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ కింద అర్హులైన వారందరికీ రుణాల మంజూరు చేయాలన్నారు. స్టాండప్ ఇండియా, విద్యా రుణాలు, వ్యవసాయ, స్వానిధి, రివర్స్ రుణాలు, ఎంప్లాయిమెంట్ జనరేషన్ రుణాలు, పీఎంఈజీపి, విశ్వకర్మ, హార్టికల్చర్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ల కోసం రుణాల మంజూరులో లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి
పెండింగ్ పనులు సత్వరమే ప్రారంభించి.. పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రైల్వే, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, అటవీ, చిన్న నీటిపారుదల శాఖలకు సంబంధించి భూ సేకరణ అంశాలపై ఆయా శాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ.. 716జీ జాతీయ రహదారి, అనుబంధాలు, పెండింగ్ సమస్యలను వారం లోపు పరిష్కరించాలన్నారు. భూ సమస్యపై ఎలాంటి సందేహాలు ఉన్నా.. జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. చిలమత్తూరు మండల పరిధిలోని చాగలేరు గ్రామ ప్రజలతో మాట్లాడి భూగర్భ మార్గాన్ని క్లియర్ చేయాలని ఎన్‌హెచ్ అధికారులకు ఆదేశించారు. నేషనల్ హైవే 342కు సంబంధించి ప్యాకేజీ 1, ప్యాకేజీ 2 పనులపై సమీక్షించి త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలన్నారు. ఫారెస్ట్ అధికారి చక్రపాణి, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, నేషనల్ హైవేస్ అధికారి అశోక్‌రెడ్డి, ఎస్‌హెచ్ డీఈ గిడ్డయ్య, మేనేజర్ ముత్యాలరావు, ఏపీ మైన్స్ అధికారి పెద్దిరెడ్డి, భూసేకరణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 18న నిర్వహించే రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు, నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఏ చిన్నపొరబాటుకు తావివ్వొద్దని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను డీఈఓ ఆదేశించారు. గురువారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ, నవోదయ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,987 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అనంతపురం జిల్లాలో 15, శ్రీసత్యసాయి జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 18న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు గంటముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఏమాత్రం ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని డీఈఓ ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ పాల్గొన్నారు.

కవర్లు ఇక్కడ .. కంది పప్పు ఎక్కడ ?

చిలమత్తూరు: ప్రజావసరాల కోసం ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే కంది పప్పు ప్యాక్ చేసిన ఖాళీ కవర్లు రాష్ట్ర సరిహద్దు దగ్గర కుప్పలు తెప్పలుగా కనిపించడం కలకలం రేపుతోంది. కంది పప్పును వేరే బ్యాగుల్లోకి వేసుకొని కవర్లు మాత్రం ఇక్కడే వదిలిసి వెళ్లినట్లు స్పష్టమవుతోంది. అయితే ప్రభుత్వం నుంచి రేషన్‌కార్డుదారులకు కంది పప్పు సరఫరా కాలేదని ప్రచారం చేస్తూ రేషన్ షాపు నిర్వాహకులతో పాటు కూటమి నాయకులే ఈ దందా చేస్తున్నారన్న విమర్శలున్నాయి. కంది పప్పును రేషన్ దుకాణాల్లో కేజీ రూ.67కు విక్రయించాల్సి ఉండగా బయటి మార్కెట్‌లో రూ.130 నుంచి రూ.150 వరకూ విక్రయిస్తున్నారు. గత రెండు మూడు నెలలుగా పేదలకు అందాల్సిన కంది బ్యాళ్లు పక్కదారి పడుతున్నా ఉన్నతాధికారులెవరూ పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. కవర్లు పారవేసిన ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు.



చిలమత్తూరు: రాష్ట్ర సరిహద్దులో పడివున్న కందిపప్పు కవర్లు

అక్రమ మద్యం విక్రయదారుడికి రూ.2 లక్షల జరిమానా

గోరంట్ల: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన కేసులో గోరంట్ల పట్టణానికి చెందిన మారగానికుంట సోముశేఖర్ అనే వ్యక్తికి గురువారం పెనుకొండ ప్రిన్సిపల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి బొజ్జప్ప రూ.2 లక్షల జరిమానా విధించినట్లు సీఐ శేఖర్ తెలిపారు. ఆయన వివరాలమేరకు.. మారగానికుంట సోముశేఖర్ 2020 సంవత్సరం ఆగస్టు 18న కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా కర్ణాటక విస్కీ, టెట్రా ప్యాకెట్లు 122 తరలిస్తుండగా అప్పట్లో గోరంట్ల పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. నేరం రుజువు కావడంతో సోముశేఖర్‌కు రూ.2లక్షల జరిమానా విధించారు.

నీ నామమే మధురం సాయి..



సంగీత కచేరీలో పాల్గొన్న శ్రీసత్యసాయి యంగ్ అడల్ట్స్ బృందం

ప్రశాంతి నిలయం: సాయి భక్తులు చక్కటి భక్తి గీతాలతో నిర్వహించిన కచేరీ అలరించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసిన శ్రీసత్యసాయి యంగ్ అడల్ట్స్ బృందం గురువారం సాయంత్రం సాయి సన్నిధిలో సంగీత కచేరీ నిర్వహించింది. సత్యసాయి ప్రేమతత్వాన్ని, సేవాభావాన్ని కొనియాడుతూ గంట పాటు సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం వారు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న కారు



రాముడుకు సపర్యలు చేస్తున్న స్థానికులు

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు... తాడిమర్రికి చెందిన బండారు రాముడు ద్విచక్రవాహనంపై గురువారం ముదిగుబ్బ మండలం గొంగటిలింగాయపల్లిలో సమీప బంధువుల ఇంట శుభకార్యానికి హాజరయ్యారు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన బత్తలపల్లి మండలం రామాపురం కూడలి వద్ద జాతీయ రహదారిని క్రాస్ చేస్తుండగా అనంతపురం నుంచి కదిరి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో రాముడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రునికి స్థానికులు సపర్యలు చేసి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: స్థానిక జీఆర్పీ పరిధిలోని హిందూపురం–మలగూరు స్టేషన్ల మధ్య గురువారం ఉదయం 9 గంటల సమయంలో రైలు కింద పడి ఓ వ్యక్తి (40) మృతి చెందాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైలు దూసుకెళ్లడంతో మృతదేహం ఛిద్రమైనట్లుగా తెలిపారు. వ్యక్తి మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే 93988 66299కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్



స్వామి తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ పి.హరినాథ్‌గుప్త, తెలంగాణ రాష్ట్ర ఆదిలాబాద్ జిల్లా మాజీ ప్రిన్సిపల్ జడ్జి జి.గోపాలకృష్ణ... గురువారం సాయంత్రం కసాపురం నెట్టికంటి స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మొక్కజొన్న.. ఆదాయం మిన్న

- మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి
- ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి



పుట్టపర్తి వద్ద సాగు చేసిన మొక్కజొన్న పంట

పుట్టపర్తి అర్బన్: వాణిజ్య పంటల సాగులో లాభాలు ఆర్జిస్తున్న రైతులు ఈ రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగుపై అమితాసక్తి చూపారు. పెట్టుబడులు తక్కువ... లాభాలు ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. పెనుకొండ వ్యవసాయ డివిజన్ పరిధిలో ఖరీఫ్, రబీల్లో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 4 వేల హెక్టార్లు కాగా, ఈ ఏడాది 7,217 హెక్టార్లకు ఎగబాకడం గమనార్హం.

120 రోజుల్లో పంట చేతికి..

జిల్లా వ్యాప్తంగా రబీలో అత్యధికంగా సాగు చేసే మొక్కజొన్న 110 రోజుల నుంచి 120 రోజుల్లోపు పూర్తవుతుంది. ఇందులో అత్యధికంగా కావేరి 333, కావేరి బంపర్, డీకే, అడ్వాంటా తదితర విత్తన రకాలు అందుబాటులో ఉన్నాయి. ఎకరాకు 8 కిలోల విత్తనం అవసరం కాగా, నాలుగు కిలోల బ్యాగ్ ధర రూ.1,600 నుంచి రూ.2వేల చొప్పున రైతులు కొనుగోలు చేశారు. ఒక ఎకరా విస్తీర్ణంలో పంట సాగు చేస్తే కనీసం 20 నుంచి 30 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తోంది. ఖరీఫ్ చివర్లో మొక్కజొన్న క్వింటా ధర ఏకంగా రూ.2,800 వరకూ పలికింది. ఈ రబీలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటకు క్వింటాకు రూ.1,850 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు రూ.2 వేల వరకూ ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. విత్తు వేసిన తర్వాత కలుపు నివారణ మందు పిచికారీ చేయడం, సస్యరక్షణలో భాగంగా కత్తెర పురుగు నివారణకు కాస్తా ఖర్చు వస్తుంది. పంట పూర్తయిన తర్వాత యంత్రాల సాయంతోనే కోస్తున్నారు. దిగుబడిని రెండు మూడు రోజులు ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు.

లాభాలు బాగున్నాయి



మొక్కజొన్న సాగులో లాభాలు బాగున్నాయి. నేను ఏటా మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తుంటా. చీడ పీడలు అధికంగా ఉండవు, కత్తెర పురుగును నివారించుకోగలిగితే చాలు. ఎకరాకు ఖర్చులు పోనూ రూ.50 వేల వరకూ ఆదాయం ఉంటుంది. పశువులకు మంచి మేతగాను ఉపయోగిస్తున్నాం.

– నరసింహారెడ్డి, రైతు, వెంకటగారిపల్లి, పుట్టపర్తి మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



మొక్కజొన్నకు మార్కెట్‌లో అధిక ప్రాధాన్యత ఉన్నా గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. దాణాతో పాటు పౌష్టికాహారంలోనూ మొక్కజొన్నలు వాడుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలి.

– శ్రీనివాసరెడ్డి, రైతు లింగాలపల్లి, ఓడీసీ మండలం

సాగు విస్తీర్ణం పెరిగింది



నీటి వనరులు అధికంగా ఉండడం, మార్కెట్‌లో ధరలు నిలకడగా ఉండడంతో జిల్లాలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. అంతేకాక పెట్టుబడుల భారం కూడా తక్కువే. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. కూలీలపై ఆధార పడకుండా పంట సాగు చేపట్టవచ్చు. పంట మార్పిడిలో భాగంగా వేరుశనగ తర్వాత మొక్క జొన్న సాగు చేపడితే లాభాలు గడించవచ్చు.

– సనావుల్లా, ఏడీఏ, పెనుకొండ డివిజన్

నా స్థలంలో మృతదేహాన్ని ఎలా ఖననం చేస్తారు?

- అధికారులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతు



లక్ష్మీనారాయణ పొలంలో మృతదేహాన్ని పాతిపెట్టేందుకు గుంత తీస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: దశాబ్దాలుగా సాగులో ఉన్న తన పొలంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రెబ్బల నాగమ్మ (95) మృతదేహాన్ని ఉద్దేశపూర్వకంగా ఖననం చేశారని, ఇలా ఎలా చేస్తారంటూ అధికారులను రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన దివ్యాంగ రైతు చిల్లా లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. ఘటనపై గురువారం రామగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుంటిమద్ది గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 388–3లో 4.9 ఎకరాల భూమిని 30 ఏళ్ల క్రితం కొనుగోలు చేసినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రెబ్బల శ్రీరాములు, రెబ్బల రామకృష్ణయ్య తల్లి నాగమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందితే దౌర్జన్యంగా తన పొలంలో మృతదేహాన్ని పాతిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి సందర్భంగా కుటుంబసభ్యులతో కలసి తాను ఊరెళ్లాలని, వచ్చిన తర్వాత ఈ విషయం తెలియడంతో ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో శ్మశాన వాటిక ఉన్నా.. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఇదే విషయమై తహసీల్దార్‌కూ బాధితుడు ఫిర్యాదు చేశాడు.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

రాయదుర్గంటౌన్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు రాకపోకలు సాగించేందుకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేసినట్లు సౌత్ వెస్ట్రన్ రైల్వే హుబ్లీ డివిజన్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించడానికి ఇప్పటికే కోట్లాది మంది తరలివెళుతున్నారు. ఫిబ్రవరి 26వ తేదీ వరకూ కుంభమేళా జరగనుంది. ఈ క్రమంలో నెలలో ఒక ట్రిప్పు చొప్పున జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాల్లో రాయదుర్గం, బళ్లారి మీదుగా మైసూరు–దానాపూర్–మైసూర్ ప్రత్యేక రైలును నడుపుతున్నారు. జనవరి 18, ఫిబ్రవరి 15, మార్చి 1 తేదీ శనివారాల్లో మైసూరులో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరిన రైలు (06207) బెంగళూరు, చిత్రదుర్గ, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, హుబ్లీ, విజయపుర, సత్నా, ప్రయాగ్‌రాజ్ మీదుగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్‌కు చేరుకుంటుంది. అలాగే జనవరి 22న, ఫిబ్రవరి 19, మార్చి 5న బుధవారాల్లో దానాపూర్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత 1.45 గంటలకు బయలుదేరిన రైలు (06208) అదే స్టేషన్ల మీదుగా మైసూరుకు చేరుకుంటుంది.

చిరుత దాడిలో మేక మృతి

మడకశిర రూరల్: మండలంలోని కల్లుమర్రి గ్రామ సమీపంలో పొలాల్లో మేత మేస్తున్న మేకలపై గురువారం చిరుత దాడి చేసింది. ఘటనలో ఓ మేక చనిపోయింది. కాపరి నారాయణ నుంచి సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారి కుల్లాయప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. పశు వైద్యాధికారితో పంచనామా నిర్వహించి, నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం: నగరంలోని సాయినగర్ మొదటి క్రాస్, రామన్ స్కూల్ సమీపంలో బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు... రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమై గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రామన్ స్కూల్ వద్ద బొలెరో వాహనంలో తరలిస్తున్న 2,146 కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, పుట్టపర్తి మండలం బుగ్గపల్లికి చెందిన గుడిపాటి హరికృష్ణ, అనంతపురంలోని సాయినగర్ మొదటి క్రాస్‌కు చెందిన పసుపుల సురేష్‌ను అరెస్ట్ చేశారు.

లో ఓల్టేజీ సమస్యపై రైతుల ధర్నా



విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

అగళి: లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలంటూ అగళి మండలం హెచ్‌డీహళ్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట గురువారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు రామకృష్ణ, నరసింహరాజ్, అశ్వత్థ, తిప్పేస్వామి, వసంత, మంజునాథ్, లక్ష్మీనారాయణ, వీరభద్ర తదితరులు మాట్లాడారు. లో ఓల్టేజీ సమస్య కారణంగా వారానికి రెండు మూడు సార్లు తమ సబ్మెర్సిబుల్ మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక పోతున్నామని, తాజాగా మోటార్లు కాలిపోతుండడంతో వాటి మరమ్మతుకు తిరిగి అప్పులు చేయాల్సి వస్తోందని మండిపడ్డారు. ఏదైనా విద్యుత్ సమస్య తలెత్తితే పరిష్కరించే వారే లేరని వాపోయారు. సమస్య పరిష్కారం కోరుతూ ఇప్పటికే మూడు సార్లు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనలు చేపట్టామని గుర్తు చేశారు. అయినా అధికారులు స్పందించక పోవడం బాధాకరమన్నారు. రోజూ మూడు నుంచి నాలుగు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని, అది కూడా లో ఓల్టేజ్ కారణంగా మోటార్లు ఆడడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ ఇన్‌చార్జ్ ఏఈ నిజాముద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దాదాపు 50 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ జయశ్రీ

హిందూపురం అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా రవాణా అధికారి కరుణసాగరరెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 15వ తేదీ వరకూ నిర్వహించే రహదారి జాతీయ భద్రతా మాసోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, డ్రైవింగ్ సమయంలో వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులు, ర్యాలీలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన..

ప్రమాదరహిత డ్రైవింగ్‌పై ఆర్టీసీ డ్రైవర్లకు గురువారం ఎంవీఐ జయశ్రీ అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితమని చాలా మంది భావిస్తుంటారని, ఆ దిశగా ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని డ్రైవర్లకు సూచించారు. బస్సు ఎక్కే సమయంలో, దిగే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి ప్రదేశాల్లో ఓవర్‌టేక్ చేయాలి, రద్దీ ప్రదేశాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్టీసీ డీఎం శ్రీకాంత్ మాట్లాడుతూ... ఆర్టీసీ తరపున ఏ ఒక్కరూ ప్రమాదానికి గురి కాకూడదన్న లక్ష్యంతో వాహనాలను నడపాలని డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధిత గ్రామంగా బోర్డు ఏర్పాటు

- ఆదర్శంగా నిలిచిన వదనకల్ గ్రామస్తులు
- మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధించాలని డిమాండ్



బోర్డు ఏర్పాటు చేసిన గ్రామస్తులు

పావగడ: తమ గ్రామంలో మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధించి శాంతి భద్రతలు నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ వదనకల్ గ్రామస్తులు గురువారం వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. గ్రామ నడిబొడ్డున 'మద్యపాన నిషేధిత గ్రామం' అని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖుడు బ్రహ్మేంద్రచార్ మాట్లాడారు. గ్రామంలో మద్యం విక్రయాలతో మందుబాబుల బెడద ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా యువకులు మద్యానికి బానిసై పెడదారి పడుతున్నారన్నారు. సాయంత్రం గ్రామంలో మహిళలు స్వేచ్ఛగా బయట తిరగలేకపోతున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా మద్యం విక్రయాలను అరికట్టలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులంతా సమావేశమై చర్చించుకున్న అనంతరం తమ గ్రామాన్ని మద్యపాన నిషేధిత గ్రామంగా పేర్కొంటూ గ్రామ నడిబొడ్డున బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో మద్యం అమ్మకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్‌ను కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. అనంతరం ఇకపై తమ గ్రామంలో మద్యం విక్రయాలు చేపట్టకూడదని విక్రయదారులను హెచ్చరించారు.

అనంత వేదికగా లఘు చిత్రాల పండుగ



వివరాలు వెల్లడిస్తున్న దర్శకుడు రషీద్

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా మరో లఘు చిత్రాల పండుగ ఈ నెలలో ప్రారంభం కానుంది. అనేక ప్రాంతాల నుంచి విచ్చేసే బుల్లితెర నటీనటులతో మరో చిత్రోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం అనంతపురం ఫిలిం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీ దర్శకుడు రషీద్‌బాషా, టీవీ–సినీనటుడు రమేష్ నీల్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీధర్, సీనియర్ డ్యాన్స్ మాస్టర్ కత్తి విజయ్‌కుమార్, సామాజిక సేవా కార్యకర్త తోట బాలన్న తదితరులు మాట్లాడారు. గతంలో అనంత వేదికగా 6 సార్లు లఘు చిత్రోత్సవం నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తూ మరోసారి 18 కేటగిరీలలో ఉత్తమ చిత్రాలకు, సాంకేతిక నిపుణులకు, నటీనటులకు, డైరెక్టర్లకు ఉత్తమ పురస్కారాలనందిస్తామన్నారు. ఇప్పుడిప్పుడే రాణిస్తున్న దర్శక, నిర్మాతలను ప్రోత్సహించేందుకు జీఎంఎస్ గ్యాలరీ సహకారంతో రూ.50 వేల బడ్జెట్‌తో తామే లఘు చిత్రం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25వ తేదీలోపు ఎంట్రీలను పంపాలని కోరారు. పూర్తి వివరాలకు 96763 50651, 72880 22467 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కశ్మీర్‌లో ధర్మవరం జవాను మృతి



వెంకటరమణారెడ్డి (ఫైల్)



వెంకట రమణారెడ్డి భౌతికకాయాన్ని తరలిస్తున్న బీఎస్‌ఎఫ్ అధికారులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణానికి చెందిన బీఎస్‌ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ కాశ్మీర్‌లో బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు... ధర్మవరం పట్టణం నాగులబావివీధికి చెందిన వెంకట రమణారెడ్డి(40) బీఎస్‌ఎఫ్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా కశ్మీర్ బార్డర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉష్ణోగ్రతలు పడిపోవడంతో విధుల్లో ఉన్న వెంకటరమణారెడ్డి గుండెపోటుకు గురై మృతి చెందాడు. వెంటనే బీఎస్‌ఎఫ్ వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించినా ఫలితం లేకపోయిందని అధికారులు తెలిపారు. సమాచారాన్ని బీఎస్‌ఎఫ్ అధికారులు ధర్మవరంలోని వెంకట రమణారెడ్డి కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంకట రమణారెడ్డికి భార్య హరిప్రియ, కుమారుడు మహిధర్‌రెడ్డి, కుమార్తె రిత్విక ఉన్నారు. వెంకట రమణారెడ్డి భౌతికకాయం గురువారం రాత్రి ధర్మవరానికి చేర్చారు. వెంకట రమణారెడ్డి స్వగ్రామం చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దండి : ఆర్టీసీ ఆర్‌ఎం



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం మధుసూదన్

పుట్టపర్తి టౌన్: రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా జిల్లాను ప్రమాదరహితంగా తీర్చి దిద్దాలని ఆర్టీసీ డ్రైవర్లకు ఆ సంస్థ ఆర్‌ఎం మధుసూదన్ సూచించారు. పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను డిపో మేనేజర్ ఇనాయతుల్లాతో కలసి గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. డ్రైవర్లు తగినంత విశ్రాంతి తీసుకొని ఏకాగ్రతతో బస్సులు నడపాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ హరిత, గ్యారేజ్ ఇన్‌చార్జ్ విజయానంద్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల భవనాల పరిశీలన

మడకశిర రూరల్: మండలంలోని గుండుమల గ్రామంలో ఉన్న బీసీ బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణాలను గురువారం బీసీ వెల్ఫేర్ ఎండీ దేవేందర్‌రెడ్డి, ఎస్‌ఈ శివకుమార్, ఈఈ రమణారెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులు ఎంత మేర పూర్తి చేశారని స్థానిక అధికారులతో ఆరా తీశారు. నిర్ణీత గడువు లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతా నుంచి నగదు అపహరణ

ముదిగుబ్బ: మండల కేంద్రంలో సైబర్ నేరం జరిగింది. ముదిగుబ్బకు చెందిన నాగార్జునకు స్థానిక యూనియన్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. ఈ 14న ఉదయం ఆయన ఖాతా నుంచి రూ.32వేలను ఆయనకు తెలియకుండా సైబర్ నేరగాళ్లు అపహరించారు. విషయాన్ని పసిగట్టిన ఖాతాదారుడు గురువారం బ్యాంక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నీటి చౌర్యాన్ని అరికట్టాలి

అనంతపురం సెంట్రల్: పీఏబీఆర్ కుడికాలువ కింద అన్ని చెరువులను నీటితో నింపాలని జిల్లా పండ్లతోటల రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్‌ను కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. పీఏబీఆర్ నుంచి కుడి కాలువ ద్వారా చెరువులకు విడుదల చేసిన నీటిని ఇటీవల పరిశీలించినట్లు తెలిపారు. అయితే కూడేరు మండలం సమీపంలో ఉదిరిపికొండ, వడ్డుపల్లి తదితర ప్రాంతాల్లో కొంతమంది కాలువకు గండ్లు కొట్టి నీటిని అనధికారికంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. దీని వల్ల దిగువ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. వెంటనే నీటి చౌర్యాన్ని అరికట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అనంతరాముడు, నారపరెడ్డి, ఆనంద్, మురళీమోహన్ చౌదరి, వెంకటేశ్‌చౌదరి, చల్లా రామాంజనేయులు, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

మట్టి దొంగకే 'మైనింగ్' మద్దతు!

- లేపాక్షి హబ్‌లో ఆ పోలీసు మట్టి అక్రమ తవ్వకాలపై నామమాత్రపు విచారణ



ఈ నెల 9న లేపాక్షి నాలెడ్జ్ హబ్‌లో తనిఖీలు చేస్తున్న మైనింగ్ శాఖ అధికారులు (ఫైల్)

చిలమత్తూరు: వడ్డించేవాడు మనవాడైతే.. బంతిలో చివర కూర్చున్నా అన్నీ అందుతాయి అనేది నానుడి. అచ్చం ఇలాగే మారింది ఓ ఎస్‌ఐ అక్రమ మట్టి తవ్వకాలపై విచారణ. రాప్తాడు నియోజకవర్గంలో పని చేస్తున్న ఎస్‌ఐ మట్టి అక్రమ తవ్వకాలపై 'పోలీసే మట్టి దొంగ' శీర్షికన ఈ నెల 5న 'సాక్షి'లో వెలువడిన కథనం విదితమే. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిన మైనింగ్ అధికారులు తీరుబడిగా ఈ నెల 9న హబ్ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టిన ప్రాంతాన్ని గుట్టు చప్పుడు కాకుండా పరిశీలించి వెళ్లారు. అనంతరం సంక్రాంతి సెలవులు రావడంతో ఈ విషయాన్ని స్థానికులు మర్చిపోతారనే భావించారు. విచారణను సైతం నామమాత్రంగానే నిర్వహించి, వివరాలను గోప్యంగా ఉంచారు. సదరు ఎస్‌ఐ కొనుగోలు చేసిన భూమి వాలుగా ఉండడంతో దానిని చదును చేసేందుకు ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న లేపాక్షి నాలెడ్జి హబ్‌లోని భూముల నుంచి వందలాది టిప్పర్ల మట్టిని వారం రోజుల పాటు తరలించారు. జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన పోలీసు అధికారినే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ కోర్టు పరిధిలోని భూముల్లో అక్రమంగా చేపట్టిన మట్టి తవ్వకాలపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోడూరు వద్ద ఇలాగే ఓ భూ యజమాని అక్రమంగా మట్టి తరలించడంతో రూ. 2 కోట్ల మేర జరిమానా విధించారు. అయితే ఎస్‌ఐపై మాత్రం ఎలాంటి చర్యలూ లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి నేతల అండతోనే మట్టి అక్రమ తరలింపుల వ్యవహారం నీరుగారుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన అక్రమాలపై కథనం ప్రచురితం కాగానే సదరు ఎస్‌ఐ ఆగమేఘాలపై ఇద్దరు ఎమ్మెల్యేలను ఆశ్రయించి ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో మనోడే కదా అని వదిలేస్తారా? లేదా చర్యలు తీసుకుంటారా? అనేది వేచి చూడాలి.